క్లుప్తంగా

క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజశేఖర్

బేస్తవారిపేట: స్థానిక క్షేమ దంత వైద్యశాలలో ఒంగోలుకు చెందిన హెచ్‌సీజీ ఎంఎస్‌ఆర్ క్యాన్సర్ వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రాజశేఖర్ 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో నలుగురిని మెరుగైన వైద్య చికిత్సల కోసం ఒంగోలుకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో క్షేమ వైద్యశాల డాక్టర్ సువర్ణ, హెచ్‌సీజీ ఎంఎస్‌ఆర్ వైద్యశాల మేనేజర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

తర్లుపాడు: మండల స్థాయి పాఠశాల విద్యార్థులకు తర్లుపాడు జెడ్పీ హైస్కూల్‌లో నేడు అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో శానిటేషన్ వర్కర్లు శుక్రవారం స్థానిక తహశీల్దార్ ఆంజనేయరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు నరసింహులు మాట్లాడుతూ వర్కర్లకు 8 నెలల నుంచి గౌరవ వేతనం ఇవ్వలేదన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వేతనాలు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్లు, యూనియన్ నాయకులు సమీరా, పుష్ప, రాధ, జహీరాబి, పాల్గొన్నారు.

హైస్కూల్ వజ్రోత్సవాలకు విరాళం



వెలుగొండారెడ్డిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

తర్లుపాడు: స్థానిక జెడ్పీ హైస్కూల్ వజ్రోత్సవాలు, అభివృద్ధి కార్యక్రమాలకు 1976-77 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన బ్యాచ్ విద్యార్థి, ప్రిన్సిపల్‌గా పదవీ విరమణ చేసిన పీ సుధాకర్‌రావు రూ.20,075 ఆర్థిక సాయం హెచ్‌ఎం సుధాకర్‌కు అందించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంభానికి చెందిన జిలానీ మరో రూ.20,075, నాయుడుపల్లికి చెందిన మండల మాజీ సొసైటీ చైర్మన్ టీ వెలుగొండారెడ్డి రూ.25,075, గోసు వెంకట సుబ్బారావు రిటైర్డు హెచ్‌ఎం రూ.25,075, సైన్సు ఉపాధ్యాయుడు పఠాన్ రెహమాన్ ఖాన్ రూ.15 వేలు, రిటైర్డు ఎంఈఓ ఎన్‌సీ కృష్ణారెడ్డి రూ.15 వేలు, పెరుమాళ్ల బాలమోహన్ రూ.15,075 ఆర్థిక సాయాన్ని అందించారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది వారిని అభినందించారు.

250 మందికి కంటి పరీక్షలు

ముండ్లమూరు (దర్శి): స్థానిక ఆదర్శ పాఠశాలలో శుక్రవారం దర్శికి చెందిన గర్నెపూడి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో కంటి సమస్యతో బాధపడుతున్న 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని ఒంగోలు కిమ్స్ హాస్పటల్ సహకారంతో ఏర్పాటు చేశామని నిర్వాహకులు ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఏంఈఓ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, కంటి వైద్యాధికారులు బి.రామాంజనేయులు, రాణిలు పరీక్షలు నిర్వహించారు. పీఆర్‌టీ గురవయ్య, సిబ్బంది మహేష్, రోజా, వసంత, తేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీ.. హామీ.. నెరవేరవేమి?

- కూటమి అధికారం చేపట్టి వంద రోజులు
- ఎన్నికల వేళ హామీలు గుప్పించిన నేతలు
- కనీస ప్రస్తావన చేయకపోవడంపై వెల్లువెత్తుతున్న విమర్శలు



మార్కాపురం యువగళంలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు(ఫైల్)

బేస్తవారిపేట/మార్కాపురం: ఏరు దాటిన తరువాత బోడి మల్లన్న సామెతగా ఉంది తెలుగుదేశం ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం తీరు. అధికారమే పరమావధిగా లెక్కలేనన్ని హామీలు గుప్పించిన కూటమి అభ్యర్థులు.. ఇప్పుడేమీ ఎరుగనట్లు ప్రవర్తిస్తుండటం చూసి జనం విస్తుపోతున్నారు. ఓట్లు వేసి గెలిపించినా అన్యాయం చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. చంద్రబాబునాయుడుతో పాటు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు గుప్పించిన హామీలను వంద రోజులైనా ప్రస్తావించకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎన్నికల సమయంలో ప్రస్తుత గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హామీల మీద హామీలిచ్చారు. గిద్దలూరు పట్టణంలోని రాచర్ల రైల్వే గేటు సమస్య పరిష్కారానికి ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడతామన్నారు. రైల్వే ఫ్లయ్ ఓవర్ నిర్మాణం కేంద్ర పరిధిలోని అంశం. గత మూడు నెలల్లో టీడీపీ కూటమి ఎంపీల ద్వారా కూడా ఆర్‌ఓబీ నిర్మాణం గురించి ఆయన ప్రస్తావించలేదు. సగిలేరు సప్లయ్ ఛానల్ వల్ల శ్రీనివాస థియేటర్, పాతాళ నాగేశ్వరస్వామి టెంపుల్ పరిసర ప్రాంతాలు వరదల సమయంలో ముంపునకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో సగిలేరు కాలువ నుంచి నీరు రాకుండా రిటైనింగ్ వాల్ నిర్మిస్తామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు సగిలేరు పొంగి లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరినా పట్టించుకోలేదు. అలాగే గిద్దలూరు మున్సిపాలిటీకి శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన ముత్తుముల ఆ దిశగా గడిచిన మూడు నెలల్లో ఒక్క ప్రయత్నమూ చేయలేదు.

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఏడాది మార్చి 31న ప్రజాగళం పాదయాత్రలో వెలుగొండ ప్రాజెక్టుకు నీళ్లొచ్చేలా చూస్తా.. ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేస్తానని చంద్రబాబుతో కలిసి కందుల హామీ ఇచ్చారు. పొదిలి పెద్దచెరువును సాగర్‌నీటితో నింపుతాం అని ప్రకటించారు. వాస్తవానికి పొదిలి చెరువుకు సాగర్ నీటి పైప్ లైన్ పనులు వైఎస్సార్ సీపీ హయాంలోనే ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పనులు నిలిచిపోయాయి. అయినా దానిపై ఒక్క సమీక్షా నిర్వహించలేదు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



గొట్లగట్టులో కబడ్డీ పోటీలను తిలకిస్తున్న క్రీడాకారులు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థిని నిర్వహించారు.



గొట్లగట్టులో రన్నింగ్ పోటీలు..



షటిల్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం స్కూల్ గేమ్స్ మండల స్థాయి పోటీలు నిర్వహించారు. కొనకనమిట్ల, గొట్లగట్టు, పెదారికట్ల, చినారికట్ల, మర్రిపాలెం, రేగడపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల క్రీడాకారులతోపాటు గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, వెలుగొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల క్రీడాకారులు పాల్గొని సత్తా చాటారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, జావెలెన్‌త్రో, రన్నింగ్ పోటీలు నిర్వహించగా ఆయా పాఠశాలల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా క్రీడా పోటీలను పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి ప్రారంభించగా పాఠశాల పీడీ బాలగురవయ్య, పీఈటీ ఉప్పుటూరి శ్రీనివాసులు పర్యవేక్షించారు. మండలస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ తెలిపారు.

హోరా హోరీగా క్రీడా పోటీలు

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో, అర్ధవీడులోని గురుకుల పాఠశాలలో మండల స్థాయిలో అండర్-14, అండర్-17 బాలబాలికలకు క్రీడా పోటీలు హోరా హోరీగా శుక్రవారం నిర్వహించారు. షటిల్, బ్యాడ్మింటన్, ఖో ఖో, మండల స్థాయిలో గెలుపొందిన టీమ్‌లు, అథ్లెట్స్ నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బలరామిరెడ్డి, హెచ్‌ఎంలు ఎంఎస్ శర్మ, కర్నాటి తిరుపతిరెడ్డి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

కొమరోలు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాపోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను మండల విద్యాశాఖాధికారులు కె.వెంకటేశ్వర్లు, బి.వెంకటరత్నం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి అండర్-14, 17 విభాగాల్లో పలు క్రీడాపోటీలు నిర్వహించారు. 7 విభాగాల్లో బాలబాలికలకు ఈ పోటీలు నిర్వహించినట్లుగా మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కె.విజయ్‌కుమార్ తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన వారిని గిద్దలూరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనడానికి అవకాశం కల్పిస్తున్నట్లుగా తెలిపారు.



కొమరోలు : వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా పట్టివేత



దీపావళి మందులను స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై రవీంద్రారెడ్డి

బేస్తవారిపేట: స్థానిక పట్టణంలోని పలు దుకాణాలను ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ ఉంచిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వాగిచర్ల మహేష్ గృహంలో రూ. 11,149, బీ శివశంకర కోటేశ్వరరావు షాపులో రూ.15,747, ఎం సత్యనారాయణ దుకాణంలో రూ.17,785 విలువైన బాణాసంచాను స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా బాణసంచా అమ్మినా, నిల్వ చేసినా కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

అర్ధవీడులో...

అర్ధవీడులోని ఓ దుకాణంలో అక్రమంగా నిల్వచేసిన రూ.60,500 దీపావళి మందులను ఎస్సై సుదర్శన్‌యాదవ్ స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమానిపై కేసు నమోదు చేశారు. లైసెన్స్ తీసుకోకుండా దీపావళి మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



కొమరోలు : సమావేశంలో మాట్లాడుతున్న గిద్దలూరు ఏడీఏ బాలాజీనాయక్

కొమరోలు: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయశాఖ గిద్దలూరు ఏడీఏ బాలాజీనాయక్ తెలిపారు. కొమరోలు పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం నుంచి ఈ చట్టం ద్వారా ఎలాంటి సమాచారాన్నైనా పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగంలో పారదర్శకత తీసుకురావడానికి, అవినీతిని నిర్మూలించడానికి, ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, ప్రజలకు జవాబుదారీగా ఉండడం కోసం సమాచార హక్కు చట్టం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి రాజశ్రీ, ఏపీఎం పాండురంగప్రసాద్ పాల్గొన్నారు.

దొనకొండలో జోరు వర్షం

దొనకొండ: మండల కేంద్రం దొనకొండలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వర్షం దంచి కొట్టింది. మెట్ట పైర్లు ఈ వర్షంతో జీవం పోసుకున్నాయి. వర్షం లేక అల్లాడుతున్న రైతులకు ఈ వాన కొద్ది ఉపశమనం కలిగింది. గ్రామాల్లోని పొలాలకు ఎరువులు వాడేందుకు చర్చించుకుంటున్నారు. మిరప, పత్తి, పొగాకు పంటలకు వర్షం శ్రేష్టకరమని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

25న చెకుముకి టాలెంట్ టెస్టు



సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో వెంకటరత్నం

కొమరోలు: జనవిజ్ఞాన వేదిక, సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో విద్యాశాఖ సౌజన్యంతో ప్రతి సంవత్సరం నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్టు ఈనెల 25వ తేదీ నిర్వహిస్తున్నట్లుగా మండల విద్యాశాఖాధికారి బొర్రా వెంకటరత్నం తెలిపారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఎంఈవో వెంకటరత్నం, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు అల్లూరయ్య, రాష్ట్ర కార్యదర్శి విశ్వరూపాచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 25వ తేదీ పాఠశాల స్థాయి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు.

ఆ దారిలో ప్రయాణం.. జనానికి కంపరం



మార్కాపురం చెరువుకట్ట రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చిల్లచెట్లు

- ప్రమాదకరంగా మార్కాపురం చెరువు కట్ట రోడ్డు
- చిల్లచెట్లతో మూసుకుపోయిన ప్రధాన రహదారి

మార్కాపురం: మార్కాపురం చెరువుకట్ట రోడ్డు చిల్లచెట్లతో మూసుకుపోయింది. మూల మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనం కనిపించకుండా పిచ్చి కంప రోడ్లకు ఇరువైపులా పెరిగింది. జిల్లా కేంద్రమైన ఒంగోలు, మార్కాపురం రైల్వేస్టేషన్‌తోపాటు రాయవరం, కలుజువ్వలపాడు, మేకలవారిపల్లి, గజ్జలకొండ, మొద్దులపల్లి, పోతలపాడు, గానుగపెంట, మన్నెంవారిపల్లి, కందివారిపల్లి, బుడ్డపల్లి తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి ఇదే కావడంతో ప్రతి పది నిమిషాలకు సుమారు 20 నుంచి 30 వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 10 లక్షల రూపాయలతో విద్యుత్ సౌకర్యం కల్పించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్ల నిర్వహణను గాలికొదిలేయడంతో రోడ్డుకు ఇరువైపులా పిచ్చిచెట్లు పెరిగి మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనం కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పక్కనే చెరువు ఉండటంతో రాత్రిపూట వాహనదారులు భయం భయంగా వాహనాలు నడపాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపులా పెరిగిన చిల్లకంపను తొలగించి లైట్లు వెలిగించేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వెలుగొండ్రాయునిపల్లి రోడ్డుదీ అదే దుస్థితి

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు నుంచి వెలుగొండ్రాయునిపల్లి బీసీ కాలనీకి వెళ్లే మట్టి రోడ్డుకు ఇరువైపులా చిల్ల చెట్లు అల్లుకపోవటంతో అటుగా వెళ్లేవారు, ముఖ్యంగా పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మట్టిరోడ్డు ఎంట్రన్స్‌లో చెత్తా చెదారం వేయటం వల్ల పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా చిల్ల చెట్లను తొలగించాలని వెలుగొండ్రాయునిపల్లి బీసీ కాలనీ వాసులు కోరుతున్నారు.



గొట్లగట్టు-వెలుగొండ్రాయునిపల్లి రోడ్డుకు ఇరువైపులా చిల్లకంప

పల్లె రోడ్లు.. గోతులమయం!



అంకిరెడ్డిపల్లెలో గుంతలు పడి అధ్వానంగా రోడ్డు



కాలువపల్లె గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు ఇలా..

రాచర్ల: ప్రధాన రహదారుల నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రాచర్ల నుంచి కాలువపల్లె గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డుపై అడుగుఅడుగునా గుంతలు పడి వర్షం నీరు నిల్వ ఉండటంతో వాహనదారులకు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. గుడిమెట్ట, దద్దవాడ గ్రామాలకు వెళ్లే క్రాస్ రోడ్డు నుంచి అంకిరెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డుపై భారీ గొయ్యి ఏర్పడటంతో వర్షం నీరు నిలిచింది. అంకిరెడ్డిపల్లె గ్రామస్తులు ఎరువులు, విత్తనాలు, సరుకులు తెచ్చుకునేందుకు దద్దవాడ లేదా గిద్దలూరుకు వెళ్లేందుకు ఈ మార్గంలోనే ప్రయాణించాల్సి ఉంది. అధికారులు స్పందించి రహదారులను బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉంటాం



గిద్దలూరులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే

గిద్దలూరు రూరల్: పేదలకు మంచి చేయడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చెప్పారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమిషనర్ డి.వెంకటదాసు, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ హేమలత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో సచివాలయ సిబ్బందితో కలిసి అధికారులు కొన్ని ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందించిన పాంప్లేట్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ నరసింహులు, స్పెషల్ ఆఫీసర్ పురాతనరెడ్డి, హౌసింగ్ ఏఈ నిర్మల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.